తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబరను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :366 | 14-07- 2026 | మంగళవారం | పేజీలు: 4 | వెల రూ.


# తెలంగాణ సమగ్ర ప్రయోజనాలే ఏకైక లక్ష్యం

## పార్లమెంట్ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులకు (ఎంపీలకు) దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సంక్షేమం, ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా, ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న వివిధ కీలక రాష్ట్ర అంశాలు, ప్రాజెక్టులపై హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఎంపీలతో ముఖ్యమంత్రి గారు ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల సాధనపై ఒక సమగ్ర దృశ్య శ్రవణ ప్రదర్శన (పవర్ పాయింట్ ప్రెజెంటేషన్) ద్వారా ఎంపీలకు వివరించారు. ఈ కీలక భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి 2

# భాగ్యనగరంలో వైభవంగా బోనాల జాతర:

### అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు



హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వ్యాప్తంగా ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆషాఢ మాస బోనాల జాతర మహోత్సవాలను ఈసారి కూడా అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబిక ఆలయం నుంచి ప్రారంభమై పాతబస్తీ లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయం వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ఈ బోనాల ఉత్సవాలకు సంబంధించి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు ఉన్నతాధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నగరానికి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో 2

# తెలంగాణలో పెరిగిన పొలిటికల్ హీట్:

### పాదయాత్రపై మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ప్రకటన



2

# ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావం..

### రైతులు ఆందోళన చెందొద్దు:



హైదరాబాద్ బ్యూరో

ఎల్‌నీనో ప్రభావం కారణంగా ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదని, అయినప్పటికీ రైతాంగం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీటిని అందించి 2

# నిర్మల్ జిల్లాలో గాడితప్పిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ..!

### ఇప్పటికైనా కలెక్టర్ నిఘా పెట్టేనా? లేదంటే ప్రభుత్వ పాఠశాల సంగతి అంతే!

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యం -- విద్యార్థుల భవిష్యత్తు అంధకారం!

నిర్మల్ జూలై 13తెలంగాణ వెన్నెల వాక్కు

నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ రోజురోజుకూ దిగజారిపోతోంది. 'బడి గుడి లాంటిది.. ఉపాధ్యాయుడు దైవంతో సమానం' అనే నానుడి ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు. వేలాది రూపాయల ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న కొందరు ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, జిల్లా విద్యాశాఖ అధికారుల చేతకానితనం వెరసి.. పేద విద్యార్థుల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నాయి. జిల్లాలోని మారుమూల గ్రామాలు, మండలాల్లో విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందనడానికి క్షేత్రస్థాయి పరిస్థితులే అద్దం పడుతున్నాయి.

**బడికి రాని బాధ్యత.. అటెండర్లే ఇక్కడ 'గురువులు'!**

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లడమే గగనంగా మారింది. ఉదాహరణకు, కుబీర్ మండలం అంతర్ని గ్రామీణ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు హాజరై కూడా పాఠాలు బోధించకుండా, 'ఉడుము కొడుతూ' (కాలక్షేపం చేస్తూ) కాలం వెళ్లదీశారు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఉపాధ్యాయులు గైర్హాజరు కావడమో, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించడమో చేస్తుండటంతో.. చివరకు పాఠశాల అటెండర్లే క్లాసులు తీసుకొని పాఠాలు చెప్పాల్సిన దారుణ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనా క్రమంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కానీ, అక్కడ నేటికీ విద్యా వ్యవస్థ మారలేదు. అలాగే మమడ మండలంలోని పులిమడుగు పాఠశాలతో పాటు అనేక మారుమూల గ్రామాల బడుల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడికి వచ్చినా గంట కూడా ఉండకుండా తిరుగుముఖం పడుతున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.

**పాఠాలు వదిలేసి.. బిట్‌కాయిన్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు!**

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా కొందరు ఉపాధ్యాయులకు బోధనపై ధ్యాస లేకుండా పోయింది. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కొందరు ఉపాధ్యాయులు బడి వేళల్లో కూడా బిట్‌కాయిన్ ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో మునిగితేలుతున్నారా..? క్లాస్ రూమ్‌లలో ఉండాల్సిన ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అక్రమ వ్యాపారాలు చేస్తూ విద్యాసంస్థల పరువు తీస్తున్నారు. గతంలో ఈ తరహా అక్రమ వ్యాపారాలకు పాల్పడి కొందరు ఉపాధ్యాయులు పోలీసులకు దొరికి, అరెస్ట్ అయిన సందర్భాలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి.. నిమ్మకు నీరెత్తిన విద్యాశాఖ!**

జిల్లా విద్యాశాఖ వ్యవహార శైలి ఈ సమస్యకు ప్రధాన కారణమని చెప్పక తప్పదు. నిరంతరం పాఠశాలలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాల్సిన విద్యాశాఖ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు (ఎచ్), టీచర్లపై గట్టి చర్యలు తీసుకుందామన్నా.. జిల్లా విద్యాశాఖ అధికారి పై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు, విద్యాశాఖ అధికారి మృదుస్వభావి కావడం వల్ల కొందరు ఉపాధ్యాయులు ఆయనను చులకనగా చూస్తూ, నిబంధనలను బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రైవేట్ బడులకు వరంగా మారిన ప్రభుత్వ**



**టీచర్ల నిర్లక్ష్యం**

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగా పాఠాలు బోధించక పోవడమే.. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు రోజురోజుకూ బలోపేతం కావడానికి ముఖ్య కారణం అవుతోంది. ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ, నాణ్యమైన బోధన కరువవడంతో నిరుపేద తల్లిదండ్రులు సైతం అప్పులు చేసైనా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. సర్కారు టీచర్ల నిర్లక్ష్యం ప్రైవేట్ యాజమాన్యాలకు పెట్టుబడిగా మారుతోంది.

కలెక్టర్ తనిఖీలు చేస్తేనే మార్పు!

జిల్లా విద్యాశాఖ పూర్తిగా నిద్రమత్తులో జోగుతోంది. జిల్లా కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి, నిరంతరం ప్రభుత్వ పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు లాంటి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మళ్లీ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యా రంగాన్ని కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



# తెలంగాణ సమగ్ర ప్రయోజనాలే ఏకైక లక్ష్యం

విక్రమార్క , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తో పాటు ఎంపీలు మల్లు రవి , అనిల్ కుమార్ యాదవ్ , ఈటల రాజేందర్ , కుందూరు రఘువీర్ రెడ్డి , కడియం కావ్య , చామల కిరణ్ కుమార్ రెడ్డి , రఘురాం రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధి -- ఐఐఎం మరియు మెట్రో విస్తరణ

దేశ జనాభాలో సుమారు పది శాతం మంది నివసిస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటని, దేశ జీడీపీలో ఇవి పాతిక శాతం వాటాను కలిగి ఉన్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం) ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతులు అవసరమని వివరించారు. రాష్ట్ర ఎంపీలందరూ కలిసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ గారిని ప్రత్యేక్షంగా కలిసి ఐఐఎం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండవ దశ విస్తరణ పనులకు సంబంధించి కేంద్రంతో జరుగుతున్న చర్చల సరళిని సీఎం వివరించారు. ఇందుకోసం 'ఎస్బీఐ క్యాప్స్' సంస్థను సలహాదారుగా నియమించేందుకు కేంద్రం అంగీకరించిందని, ఈ ప్రక్రియ మరింత వేగంగా సాగేలా చూడాలన్నారు. ముఖ్యంగా బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్ గారు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు ఈ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

మౌలిక వసతులు మరియు మూసీ పునరుజ్జీవనం

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని, ఆ పనుల ప్రారంభంతో పాటు దక్షిణ భాగం భూసేకరణ పనులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం లభించేలా ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. మూసీ నది పునరుజ్జీవన పనుల మొదటి విడత ఇప్పటికే టెండర్ల దశకు చేరుకుందని, ఈ ప్రాజెక్టును 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద చేర్చడానికి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ గారిని కలిసి అనుమతి పత్రం సాధించాలని సూచించారు.

అంతరాష్ట్ర నదీ జలాలు -- ప్రాజెక్టుల అడ్డంకుల తొలిగింపు

అంతరాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారానికి సంబంధించి ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ గారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో జరిపిన చర్చల వివరాలను ఎంపీలకు వెల్లడించారు. తుంగభద్ర డ్యామ్ నుంచి తెలంగాణకు రావాల్సిన 15.09 టీఎంసీల నీటిలో పూడిక కారణంగా ఐదు టీఎంసీల కంటే ఎక్కువ రావడం లేదని, డ్యామ్ మరియు కాలువల పూడిక తీత పనులకు పొరుగు రాష్ట్రాలు సహకరించేలా కేంద్ర మంత్రిపై ఒత్తిడి తేవాలన్నారు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీటిని తరలించే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యతను కేంద్రమే తీసుకుందని, అక్కడ లభించే మిగులు జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన 43 టీఎంసీల వాటాను అనుకూలంగా మార్చుకోవాలన్నారు. అలాగే, ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి లభించాల్సిన నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) సాధనకు, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గారితో త్వరలోనే సమావేశమవుదామని స్పష్టం చేశారు.

విమానాశ్రయాలు మరియు సమన్వయం

శంషాబాద్ విమానాశ్రయం నుంచి బెంగళూరు, చెన్నై, ముంబై నగరాలకు వెళ్లే బుల్లెట్ రైళ్ల మార్గాల రూపకల్పన తుది దశకు చేరిందన్నారు. ఆదిలాబాద్ రక్షణ విమానాశ్రయం, వరంగల్ విమానాశ్రయాలకు అవసరమైన భూసేకరణ పూర్తయిందని, అక్కడ విమానాల మరమ్మతులు (ఎమ్ఆర్ఓ), సరుకు రవాణా (ఎయిర్ కార్గో) కేంద్రాలు ఏర్పాటయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎంపీలకు దిల్లీలో అవసరమైన సమాచారాన్ని, సమన్వయాన్ని అందించేందుకు వీలుగా తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రత్యేక కోఆర్డినేటర్‌గా నియమించినట్లు తెలిపారు. అన్ని పార్టీల ఎంపీలను కలుపుకొని సమన్వయకర్తగా డాక్టర్ మల్లు రవి గారు బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరమైన భూసేకరణ పూర్తయిందని, అక్కడ విమానాల మరమ్మతులు (ఎమ్ఆర్ఓ), సరుకు రవాణా (ఎయిర్ కార్గో) కేంద్రాలు ఏర్పాటయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎంపీలకు దిల్లీలో అవసరమైన

# భాగ్యనగరంలో వైభవంగా బోనాల జాతర

పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తులు సంతోషకరమైన వాతావరణంలో జరుపుకొనేలా విస్తృతమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోని అమ్మవారి దేవాలయాలకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు అనుసంధాన రహదారులన్నింటినీ వెంటనే బాగు చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో నగరంలో పారిశుధ్యం క్షీణించకుండా నిరంతరం చెత్తను తొలగిస్తూ, యాంటీ లార్వా రసాయనాలు మరియు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. బోనాల జాతర జరిగే అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, వేసవి మరియు వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భక్తుల కోసం ఉచిత తాగునీటి కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని జలమండలి, విద్యుత్ శాఖలను ఆదేశించారు. వేడుకలు అత్యంత ప్రశాంతమైన మరియు సురక్షితమైన వాతావరణంలో జరిగేలా భారీ పోలీస్ బందోబస్తుతో పాటు అదనపు నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని శాంతిభద్రతల విభాగానికి దిశానిర్దేశం చేశారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా వాహనాల మళ్లింపు మార్గాలను ప్రకటించాలని, ఆలయాల సమీపంలో వాహనాల నిలుపుదలకు తగిన పార్కింగ్ స్థలాలను కేటాయించాలని పోలీసు శాఖకు స్పష్టం చేశారు. నగరంలోని వివిధ శివారు ప్రాంతాల నుంచి భక్తులు గోల్కొండ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా వంటి ప్రధాన ఆలయాలకు చేరుకోవడానికి వీలుగా తెలంగాణ ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులను నడపాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవార్లకు సమర్పించే అధికారిక పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలని దేవాదాయ శాఖకు సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆలయాల ప్రాంగణాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను, అంబులెన్స్ సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖను ఆదేశించారు. భాగ్యనగర బోనాల ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటేలా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేసి ఈ జాతరను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.


# తెలంగాణలో పెరిగిన పొలిటికల్ హీట్:తెలంగాణలో పెరిగిన పొలిటికల్ హీట్:

హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను మరింత ఉధృతం చేసే దిశగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కీలక నేత శ్రీ తన్నీరు హరీశ్ రావు గారు ఒక సంచలన ప్రకటన చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ సమస్యలు, ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మరియు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఆయన త్వరలోనే ఒక భారీ పాదయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందిందని, ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని హరీశ్ రావు గారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల రుణమాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడం, రైతుభరోసా పెట్టుబడి సహాయం సకాలంలో అందకపోవడం మరియు పంటల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా నిరుద్యోగులు, కార్మికులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో మరియు వారి తరపున పోరాటాన్ని ఉధృతం చేయడంలో ఈ పాదయాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.



ఈ పాదయాత్ర కేవలం ఒక రాజకీయ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజల కష్టాలను స్వయంగా చూసి, వారికి అండగా నిలబడటమే దీని ముఖ్య ఉద్దేశమని హరీశ్ రావు గారు పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాజధాని వరకు ప్రతి నియోజకవర్గంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రజాకోర్టులో ఉంచుతామని చెప్పారు. విపక్షంగా తాము శాసనసభ లోపలే కాకుండా, ప్రజాక్షేత్రంలో కూడా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ యాత్రకు సంబంధించిన పూర్తి ప్రణాళిక, రూట్ మ్యాప్ మరియు ప్రారంభ తేదీ వివరాలను త్వరలోనే పార్టీ అధిష్ఠానంతో చర్చించి అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు.

హరీశ్ రావు గారి ఈ సంచలన ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి మరియు ప్రజలతో మరింత మమేకమవడానికి ఈ పాదయాత్ర ఒక అద్భుతమైన అవకాశంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు అధికార పక్షం కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. హరీశ్ రావు గారి ప్రజాదరణ, క్షేత్రస్థాయిలో పట్టు మరియు అలుపెరుగని పోరాట పటిమను దృష్టిలో ఉంచుకుంటే, ఈ పాదయాత్ర భవిష్యత్ తెలంగాణ రాజకీయ సమీకరణాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేసే అవకాశం కనిపిస్తోంది.

# ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావం..

పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు, రిజర్వాయర్లను నీటితో నింపేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ముందస్తు కార్యాచరణను చేపట్టిందని ఆయన వెల్లడించారు.

ప్రజాభవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల తలెత్తిన నీటి ఎద్దడిని అధిగమించేందుకు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తక్షణ చర్యలు ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం పరిధిలోని 22 కీలకమైన రిజర్వాయర్లను నీటితో నింపేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు. సమ్మక్క బ్యారేజ్‌లో తగినంత నీటిని నిల్వ ఉంచగలిగితేనే, అక్కడి నుంచి పంపింగ్ ప్రక్రియ ద్వారా ఇతర కరువు పీడిత ప్రాంతాలకు మరియు ఎగువన ఉన్న రిజర్వాయర్లకు సాగునీటిని వేగంగా తరలించే అవకాశం ఉంటుందని ఆయన సాంకేతిక విధివిధానాలను వివరించారు. ఇందుకోసం అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటి అవసరాల విషయంలో అన్నదాతలకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నామని భట్టి విక్రమార్క గారు భరోసా ఇచ్చారు. ప్రతి గింజకూ నీరు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించామని చెప్పుకున్న మేడిగడ్డ బ్యారేజ్ ఎవరి నిర్లక్ష్యం వల్ల, ఎవరి హయాంలో కూలిపోయిందో రాష్ట్ర ప్రజలందరికీ క్షుణ్ణంగా తెలుసని ఎద్దేవా చేశారు. గత పాలకుల వలె తాము తప్పుడు ప్రచారాలు చేయబోమని హితవు పలికారు.

తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి గారు పునరుద్ఘాటించారు. "మా ప్రభుత్వం ప్రజలకు ఏది చెబుతుందో అదే చేస్తుంది, ఏది చేయగలదో దాన్నే స్పష్టంగా చెబుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. వర్షాలు లేకపోయినా నదుల్లో అందుబాటులో ఉన్న ప్రతి బొట్టు నీటిని ఒడిసిపట్టి, రైతుల పొలాలకు మళ్లించేందుకు విద్యుత్, నీటి పారుదల శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. కాబట్టి రైతులు అధైర్యపడి ఎలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రభుత్వం అన్ని వేళలా మీకు అండగా ఉంటుందని భట్టి విక్రమార్క గారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఓని గ్రామ పంచాయతీ పరిధిలో తహసీల్దార్ పవన్ చంద్ర ఆకస్మిక ఎస్ఐఆర్ తనిఖీ

బాసర, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని ఓని, తదితర గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బాసర తహసీల్దార్ పవన్ చంద్ర సోమవారం సాయంత్రం రెవెన్యూ అధికారిక బృందంతో కలిసి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఓటర్ల నుండి సేకరించిన దరఖాస్తులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామంలోని వయోజనులు, అర్హులైన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉండేలా ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపి బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) వెంటనే అందజేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేని పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలన్నారు. తనిఖీలో ఓని గ్రామ సర్పంచ్ జాదవ్ జగదీష్, పంచాయతీ కార్యదర్శి మధుకర్, బీఎల్ఓ అనసూయ, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# విట్టోలి తాండా గ్రామ పంచాయతీలో ముమ్మరంగా సాగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియ

ముధోల్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని విట్టోలి తాండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) దరఖాస్తుల సేకరణ ప్రక్రియ సోమవారం అత్యంత ముమ్మరంగా సాగింది. బూత్ లెవెల్ అధికారులు తాండాలోని ఇళ్లకు వెళ్లి ఓటర్ల నుండి దరఖాస్తులను స్వీకరిస్తూ కంప్యూటర్ లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా విట్టోలి తాండ పంచాయతీ కార్యదర్శి సాహెబ్రావ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, తాండా పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సిబ్బంది శ్రద్ధ వహిస్తున్నారన్నారు. నూతన ఓటర్ల నమోదు, మార్పుల కొరకై ఓటర్లు తమ ఆధార్, ఫొటోలతో కూడిన దరఖాస్తులను నిర్ణీత అధికారిక గడువులోగా సమర్పించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ కౌసల్య, రాథోడ్ గణపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఈవో భోజన్న, ఇమ్యూనైజేషన్ అధికారి నయనా రెడ్డి, అధికారులు రవీందర్, ప్రిన్సిపల్స్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ వానాకాలం.. అసలు సిసలు ఎండకాలం!

## ఆకాశం వైపు దీనంగా అన్నదాతల చూపులు

- జూన్ దాటి జూలై వచ్చినా మొహం చాటేసిన వరుణుడు!
- ఖరీఫ్ ఆరంభంలోనే రైతన్నల గుండెల్లో గుబులు రేపుతున్న ఎండలు
- మృగశిర, ఆరుద్ర కార్తెలు ముగిసినా కరవైన వర్షాలు..
- నిర్మల్ జిల్లాలో దారుణమైన ఉక్కపోత
- ఉడికిపోతున్న నిర్మల్ జిల్లా!



నిర్మల్ జూలై 13తెలంగాణ వెన్నెల వాక్కు
వాతావరణం పగ పట్టినట్లుగా ప్రవర్తిస్తోంది. క్యాలెండర్‌లో వానాకాలం సీజన్ నడుస్తున్నా.. బయట పరిస్థితులు చూస్తే మాత్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. "అసలు ఇది వానాకాలమా? లేక వేసవి కాలమా?" అని నిర్మల్ జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. మృగశిర, ఆరుద్ర వంటి కీలకమైన కార్తెలు ముగిసి, మూడో కార్తె నడుస్తున్నా వర్షాల జాడ ఏమాత్రం కనిపించడం లేదు. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకొని ఆశలు రేపుతున్నాయే తప్ప, ఒక్క చుక్క రాలడం లేదు. పైగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ఎండలు దంచి కొడుతుండటంతో అటు ప్రజలు, ఇటు అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**రైతు ప్రాణం మీదికి తెచ్చిన వ్యవసాయం**

సీజన్ ఆరంభంలో కురిసిన ఒకటో రెండో తొలి పలకరింపులను నమ్మి జిల్లా వ్యాప్తంగా సోయాబీన్, పత్తి, మక్కజొన్న సాగు కోసం రైతులు ఎగబడ్డారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి దుక్కి దున్ని విత్తనాలు నాటారు. మొలకలు వచ్చిన తొలినాళ్లలో సంబరపడ్డ రైతాంగానికి, ఇప్పుడు వాతావరణం కోలుకోలేని దెబ్బకొట్టింది. గత పదిహేను రోజులుగా వర్షాలు పూర్తిగా మొహం చాటేయడంతో తీవ్రమైన ఎండల దెబ్బకు పత్తి చేలు ఎండిపోతూ నేల వాలిపోతున్నాయి.
మరోవైపు స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల కింద నారుమళ్లు పోసిన రైతుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. నీళ్లు లేక నారుమళ్లు ఎండిపోతుంటే.. పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం అంతా బూడిదలో పోసిన పన్నీరేనా అంటూ రైతులు లబోదిబోమంటున్నారు.

**ఇళ్లలోనూ ఉక్కిరిబిక్కిరి!**

పొలాల్లో పంటల పరిస్థితి ఇలా ఉంటే, ఇళ్లలో సామాన్య ప్రజల పరిస్థితి నరకప్రాయంగా మారింది. ఉదయం నుంచే మొదలవుతున్న భయంకరమైన ఉక్కపోతతో జనం ఊపిరి తీసుకోలేకపోతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు 24 గంటలు తిరుగుతున్నా వేడి గాలుల వల్ల ఏమాత్రం ఉపశమనం లభించడం లేదు. వాతావరణం కొద్దిగా చల్లబడుతుందన్న ఆశతో ఎప్పటికప్పుడు ఆకాశం వైపు చూడటం ప్రజల వంతవుతోంది.

**ఎండిపోతున్న బోర్లు.. అప్పుల ఊబిలో అన్నదాత**

వాతావరణం రోజురోజుకు ప్రతికూలంగా మారుతుండటంతో "ఈసారి అసలు గట్టెక్కుతామా?" అనే టెన్షన్ రైతుల్లో ముదిరిపోయింది. పంటలు ఎండిపోవడం ఒకెత్తయితే, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అన్నదాతలకు రాత్రిళ్లు కంటికి కునుకు కరువైంది. ఎండల తీవ్రతకు నిర్మల్ జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. గతంలో నిరంతరాయంగా నీరు పోసిన బోరు బావులు, ఇప్పుడు సగం కంటే తక్కువ నీటిని పోస్తూ చేతులెత్తేస్తున్నాయి. దీంతో ఉన్న నీటితో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

**దిక్కుతోచని స్థితిలో రైతాంగం**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు నిర్మల్, బైంసా, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ వ్యూహాన్ని మార్చుకోక తప్పడం లేదు. నీటి లభ్యత అత్యంత దారుణంగా పడిపోవడంతో, ఇదివరకు లాగా ఎకరాల కొద్దీ సాగు చేసి నష్టపోవడం కంటే, బోరు బావుల్లో ఉన్న నీటి సామర్థ్యాన్ని బట్టే తక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని చాలామంది డిసైడ్ అవుతున్నారు. ఇంకొద్ది రోజుల్లోనైనా వరుణ దేవుడు కరుణించకపోతే జిల్లాలో వ్యవసాయ రంగం పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.



# ఓటర్ల ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించాలి



నిర్మల్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ముగింపు గడువు తేదీని తక్షణమే పొడిగించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించడం రాజ్యాంగ హక్కు అన్నారు. అయితే ఈనెల జూలై 24వ తేదీతో ఎస్ఐఆర్ గడువు ముగుస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక ఓటర్లు నిరక్షరాస్యులని, వారు ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను నింపడానికి ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. 2002 నాటి ఓటరు లిస్టులు ప్రజలకు అందుబాటులో లేకపోవడం, జీవనోపాధి కొరకు నిర్మల్ జిల్లా నుండి ముంబై, గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లిన వారు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల గడువులోగా దరఖాస్తులు అందడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఎన్యుమరేషన్ ఫారాలు అందని వారు ఉన్నారని ఆరోపించారు. అందువల్ల గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకుంట రాజేశ్వర్, లక్ష్మీ యాదవ్, చెరుకు రాజ్యం, పడిల రాజేష్, క్యాతం సాగర్, సంజయ్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



ఆర్మూర్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ మండల పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులందరికీ ఆరోగ్య రక్షణ మాత్రలను పంపిణీ చేశారు. విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అధికారులు స్వయంగా వేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట శ్రీనివాస్ విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున ఈగలు, దోమల వంటి కీటకాల ద్వారా అనేక అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు మధ్యాహ్న భోజనానికి ముందు, టాయిలెట్స్ వినియోగం తర్వాత కాళ్లు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లలు రక్తహీనత బారిన పడకుండా రక్షించబడతారని, శారీరక రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ ప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ అరుణ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బైంసా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు యు. రవికుమార్ కు ప్రతిష్టాత్మక పీహెచ్.డి పట్టా ప్రదానం



బైంసా, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు – ప్రత్యేక ప్రతినిధి):
డిగ్రీ స్థాయి విద్యార్థులు ఆంగ్ల భాషను ఎంత సమర్థవంతంగా నేర్చుకుంటారనేది వారి మాతృభాషతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుందని శాస్త్రీయంగా నిరూపిస్తూ బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్లశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ యు. రవికుమార్ చేపట్టిన అద్భుత పరిశోధనకు మహారాష్ట్రలోని నాందేడ్ స్వామి రామానంద తీర్థ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డి.) అత్యున్నత పట్టాను ప్రదానం చేసింది. 'డిగ్రీ స్థాయి విద్యార్థుల ఆంగ్ల భాష అభ్యసనంలో వివిధ మాతృభాషల ప్రభావం – ఒక తులనాత్మక పరిశోధన' అనే రికార్డు అంశంపై ఆయన ఈ పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. బహుభాషా సమాజంలో ఆంగ్ల భాషా బోధనకు సరికొత్త దిశను చూపేలా సాగిన ఈ అధ్యయనంలో, ప్రతి మాతృభాష విద్యార్థుల ఆంగ్ల భాషా అభ్యసనాన్ని భిన్న రీతిలో ప్రభావితం చేస్తుందని తేలింది. ముఖ్యంగా ఉచ్చారణ, పదసంపద, వ్యాకరణ వినియోగం, భాషా వ్యక్తీకరణ వంటి ప్రాథమిక అంశాల్లో మాతృభాష ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని రవికుమార్ తన పరిశోధన ద్వారా నిరూపించారు.

**ఉన్నత విద్యా రంగానికి విలువైన తోడ్పాటు:**

ఈ చారిత్రాత్మక పరిశోధన ప్రకారం, విద్యార్థుల మాతృభాష, వారి బోధనా ఉపాధ్యాయుల మాతృభాష ఒకటే అయినప్పుడు విద్యార్థులు ఆంగ్ల నైపుణ్యాలను మరింత వేగంగా, సులభంగా అలవర్చుకుంటారని నిర్ధారించారు. అందువల్ల ఆంగ్ల అధ్యాపకులు విద్యార్థుల మాతృభాషలపై కనీస అవగాహన కలిగి ఉంటే బోధన వంద శాతం ఫలవంతంగా మారుతుందని పరిశోధన సూచించింది. భాషా బోధనలో మాతృభాష ప్రాధాన్యతను చాటి చెప్పిన ఈ పరిశోధన ఉన్నత విద్యా రంగానికి విలువైన తోడ్పాటుగా నిలుస్తుందని విద్యావేత్తలు కొనియాడారు. యు. రవికుమార్ సాధించిన ఈ విశిష్ట విజయంపై బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా అభినందించారు.

# గుండంపల్లిలో భారీ పోలీసు కార్డెన్ సెర్చ్..

## సరైన పత్రాలు లేని 89 వాహనాలు సీజ్



నిర్మల్ రూరల్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ రూరల్ మండల పరిధిలోని గుండంపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ (తనిఖీలు) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్ ప్రత్యక్ష ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో రూరల్ పోలీసు బలగాలు గ్రామాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని ప్రతి ఇల్లాలు, వీధులను సోదా చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ఎలాంటి సరైన రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 81 ద్విచక్ర వాహనాలు (టూ వీలర్స్), 6 కార్లు, 2 ఆటోలను పోలీసులు అధికారికంగా జప్తు చేసి సీజ్ చేశారు.

రహదారుల భద్రతపై అవగాహన:

వాహనాల జప్తు అనంతరం డీఎస్పీ శ్రీనివాస్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, పల్లెల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, దొంగతనాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు, గంజాయి రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలపాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని హెచ్చరించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమన్నారు. ఈ బృహత్తర తనిఖీ కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణ, దిలావర్పూర్ ఎస్ఐ రవీందర్, నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి, నర్సాపూర్ ఎస్ఐ గణేష్, రూరల్ సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాగలింగేశ్వర ఆలయంలో మహా శివాభిషేకాలు

ఆర్మూర్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని శాసనసభ్యుడి అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో వెలిసిన శ్రీ నాగలింగేశ్వర ఆలయంలో సోమవారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలిసి వచ్చిన పవిత్ర శుభ సందర్భాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం, మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం ఈ మూడు విశేషాలు ఒకే రోజు రావడం అత్యంత అరుదైన పరమ పవిత్రమైన పుణ్యకాలం కావడంతో తెల్లవారుజామున 5:00 గంటల నుండే ఆలయానికి భక్తుల రద్దీ పోటెత్తింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి కుటుంబ సమేతంగా విచ్చేసిన సుమారు నాలుగు వేల మందికి పైగా భక్తులు పరమశివునికి ప్రత్యేక జలాభిషేకాలు, క్షీరాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రతినిధులు లోకం సత్య శ్రీనివాస్, గజవాడ రాజయ్య, జి.వి. రమణ, బండి రాజు, అంబికా బాసరమేష్, పూజారి నారాయణ, అజయ్, కలిగోట గంగాధర్, సడక్ క్రాంతి అన్ని రకాల క్యూలైన్ల ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం స్వామివారికి ముగింపు వేడుకగా కన్నులపండువగా ప్రత్యేక మహా హారతి నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



# రాజకీయం ఒక వినోదం..

# వినోదం ఒక రాజకీయం!

అగో.. వినోదం ఖతమైపోయింది, ఆటల మీద జనాలకి మోసం మొత్తింది అని ఈ మధ్యల ఈ మీడియా పండితులు తెగ లొల్లి పెడుతుండ్రు. ముప్పై ఏండ్ల సంది రాజకీయాల్నే ఒక మస్తు 'ఆడియో-విజువల్ వినోదం' లెక్క మార్చి జనాల బుర్రలకెక్కించాక, ఇప్పుడు కొత్తగ జనాల ఇష్టాల గురించి లెక్కలు గట్టడం ఏందీ నవ్వులాట కాకపోతే? మన టీవీ ఛానెళ్లు అచ్చం 'బిగ్ బాస్' ఇండ్ల తీరుగ తయారై ఎదవ ముచ్చట్లు పెడుతుంటే.. వాటిని చూసి లంగోటోళ్ళు, పక్క దేశాల వాళ్ళు నవ్వుకుంటుండ్రు. ఇప్పుడు సినిమా థియేటర్ల కంటె ఈ ఫోన్ స్క్రీన్ల మీదే అసలైన జాతర నడుస్తాంది. నవ్వులు, ఏడుపులు, నరుకుడు-పొడుడు, పొలిటికల్ పాడ్‌కాస్ట్‌లు.. ఇవే సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి.

**పోరగాళ్ల పొలిటికల్ పిచ్చి**

ఈ రోజుల్లో ఇరవైల పడిల ఉన్న పోరగాళ్లకైతే రాజకీయాల మీద మునుపెన్నడూ లేనంత పిచ్చి లేచింది. ఈ ఇంటర్నెట్ సమాచారం వాళ్ల ఉత్సుకతను ఆకాశానికి ఎక్కించింది. ఒక ఊరి ల ఉన్న బండి నడిపేటోడు చరిత్రల ఉన్నోళ్ల గురించి ఆరా తీస్తాండు, కాలేజీ పోరగాళ్లు చాట్‌జీపీటీని పాత ముచ్చట్ల గురించి అడుగుతుండ్రు. గూగుల్ ల అన్నం, కూరల కంటె ఈ 'కుర్దిష్' గొడవల గురించే ఎక్కువ వెతుకుతుండ్రు. మీడియా కూడా దానికి తగినట్టే.. లోతైన ముచ్చట్లు పక్కన పెట్టి, 'ఎక్స్‌ప్లైనర్స్' (ప్రశ్నలు-జవాబులు) పేరుతోటి గింత సమాచారాన్ని నమిలి నోట్లో పెడుతోంది.

ఒకప్పుడు పెద్ద పెద్ద చదువుకున్నోళ్లకే ఎరుకైన "జియోపాలిటిక్స్" (భూగోళ రాజకీయాలు) అనే పదం ఇప్పుడు గల్లీల దాకా పాకింది. పొల్యూషన్ లెక్కనే ఈ దేశాల యుద్ధాలు కూడా మామూలైపోయినయ్. ఈ ఏఐ కి కూడా అంతుచిక్కని తీరుగ డోనాల్డ్ ట్రంప్ లాంటి లీడర్లు ప్రపంచాన్ని తిప్పేస్తుండ్రు. వాటా మార్కెట్ పడిపోవడం సంది రాత్రి నిద్ర పట్టకపోవడం దాకా.. ప్రతి ఒక్కటి ఈ ఆందోళనల కాలంలో చిక్కుకుపోయింది. అసలు కథ ఎందుకు గింత గందరగోళంగా ఉందో తెలుసుకోవాలని పోరగాళ్లు ఆరాటపడడంలో తప్పు లేదు. కానీ, ఇది దేశాన్ని ఒక మంచి సమాజంగా కాకుండా, ఉత్తగ పరీక్షలు రాసే బొమ్మల దేశంగా మార్చేసింది. జనాలు కూడా ఏ ముచ్చటనైనా తక్కువ టైంల చదివి పారేస్తుండ్రు.

**సినిమాలు.. లీడర్ల గిమ్మిక్కులు**

అయినా, ఈ రాజకీయాల లొల్లిల వినోదానికి గిరాకీ తగ్గిందని అనుకుంటే పొరపాటే. పక్కనున్న తమిళనాడుల నటుడు విజయ్ రాజకీయ పార్టీ పెట్టగానే యావత్ పోరగాళ్లంతా ఆయన వెనకాల ఉరికిండ్రు. ఇప్పుడు ఇండ్లల్ల ఉన్న యాభై ఏండ్ల పెద్ద మనుషులను వాళ్ల పిల్లలే ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి విజయ్ పార్టీకి ఓటు వేయించే పరిస్థితి వచ్చింది. సినిమా ఇండస్ట్రీల మునుపటి సర్కార్ పెట్టిన ఇబ్బందుల వల్లే ఆయన రాజకీయాల్లోకి వచ్చిండనే ముచ్చట నడుస్తాంది. సినిమాల గొడవ కాస్తా రాజకీయాల్లోకి రావడం చూస్తే.. సౌత్ ఇండియా రాజకీయాలకి సినిమాలతో ఉన్న బంధం ఇంకా తెగలేదని తెలుస్తాంది. ఆఖరికి కేరళ సీఎం కూడా నేను గట్లనే సినిమాలు చూస్తా, చలనచిత్ర ఉత్సవాలకి పోతా అని చెప్పుకుంటూ పోరగాళ్లను పడేసే ప్రయత్నం చేస్తాండు.

**పశ్చిమ బెంగాల్ సోషల్ మీడియా రచ్చ**

ఇక పశ్చిమ బెంగాల్ ల చూస్తే.. అక్కడ పెద్ద యుద్ధం కేవలం 'సీఎం వర్సెస్ మమతా బెనర్జీ మాత్రమే కాదు. సోషల్ మీడియా అంతా సెలబ్రిటీల చుట్టూనే రచ్చ రచ్చ నడుస్తాంది. ఒకప్పటి నటి, టీవీ షోల 'దీదీ నెం. 1' గా పేరు తెచ్చుకుని ఇప్పుడు ఎంపీ అయిన ఒక నాయకురాలు పార్టీలు మారడం, ఆమె చేసిన దొడ్డు మాటలు పెద్ద దుమారమే లేపినయ్. "అర్బనా బిల్డింగ్ ల ఉండాలంటే గంత క్లాస్ ఉండాలి" అని, ఒక సామాన్య పిల్ల గురించి ఆమె చేసిన చులకన మాటలు సోషల్ మీడియా ట్రోలర్లకు మస్తు మేతగా మారినయ్. ఆ కాలనీ ముచ్చట పట్టుకుని జనాలు ఆమెను




ఆడుకుంటుండ్రు.

**పంజాబ్ నెత్తుటి చరిత్ర – 'సట్లజ్' రచ్చ**

పంజాబ్ ల కథ ఇంకా ఘోరంగా, గంభీరంగా ఉంది. సెన్సార్ బోర్డు తోటి ఏండ్ల తరబడి కొట్లాడి, వెయ్యి కత్తెర గాట్లతోటి థియేటర్ల దాకా రాలేకపోయిన ఒక గట్టి సినిమా అకస్మాత్తుగా లి'సట్లజ్' లి అనే పేరుతోటి ఓటీటీలకి వచ్చింది. కానీ సర్కార్ నొక్కుడు వల్లనో ఏమో.. అది వెంటనే మాయమైపోయింది. లీగల్ గా బ్యాన్ ఉన్నా లేకపోయినా.. ఇప్పుడు ఈ సినిమా ప్రతి వాట్సాప్ గ్రూపుల దావానలం లెక్క షేర్ అవుతాంది. ఈ వారాంతం లోపల ఎట్లనైనా సినిమా చూడాలని జనాలు కొట్టుకుంటుండ్రు. ఆఖరికి ప్రార్థనా మందిరాలల్నే స్క్రీన్లు పెట్టి చూపిస్తుండ్రు అంటే నమ్మండి. ఈ సినిమా తోటే ఇప్పటి పోరగాళ్లు పంజాబ్ ల జరిగిన నెత్తుటి చరిత్రను, నాటి అణిచివేతను కండ్లారా చూస్తుండ్రు. చట్టాన్ని కాపాడటానికి కొన్నిసార్లు రాజ్యాంగాన్ని, పౌర హక్కులను పక్కన పెట్టక తప్పదనే సర్కార్ ముచ్చట్లను ఈ సినిమా గట్టిగ అడుగుతాంది. చట్టాన్ని రక్షించే నెపంతోటి చట్టాన్ని ఎట్లా ఖతం చేసిండ్రో చూపిస్తాంది. పెద్ద పెద్ద మేధావుల కుటుంబాలు కూడా నాటి సామూహిక పూడ్చిపెట్టడాలను సమర్థించడం ఒక పెద్ద విచిత్రం. కానీ, ఈ పెద్ద మనుషులు ఎంత తొక్కిపెట్టాలని చూసినా.. ఈ మనుషుల కథలు సమాధుల సంది దయ్యాల లెక్క – కవిత్వం, నిరసన, పాట లేదా సినిమా రూపంలో బయటపడక మానవు. బెంగాల్, పంజాబ్ రెండు రాష్ట్రాలూ దేశ విభజన గాయాలను, తీవ్రవాద గొడవలను చూసినవే. తుపాకీ గుండ్లకి ఒక పూర్తి తరాన్ని బలిచ్చినవే. ఆ బుల్లెట్ల వల్లే మళ్లీ లైన్ లోకి వచ్చారని కొందరంటారు కానీ, పంజాబ్ బయటకి పచ్చగ, పైసలున్నోడి లెక్క కనిపిస్తున్నా.. లోపల మాత్రం అది మస్తు గాయాలతోటి, ఆర్థిక కష్టాలతోటి కొట్టుమిట్టాడుతాంది.

ఆఖరికి తేలే ముచ్చట ఏందంటే.. ఇప్పుడు రాజకీయం ఒక వినోదంగా మారితే, వినోదం కూడా రాజకీయంగా మారుతాంది. రెంటికీ తేడా లేకుండా పోయింది. ఇదంతా నిజమే అని చెప్పడానికి.. మీ చేతిలో ఉన్న మొబైల్ స్క్రీన్ల మీద నిరంతరం వస్తున్న కంటెంటే సాక్ష్యం! దీనికి వేరే రుజువులు అవసరం లేదు.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషణ 9848559863**

## ఆర్మూర్ పట్టణంలో సిఐఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల అప్పగింత



ఆర్మూర్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన విలువైన మొబైల్ ఫోన్లను కేంద్ర ప్రభుత్వ సిఇఐఆర్ వెబ్ పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. సోమవారం ఆర్మూర్ పట్టణ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను వాటి అసలైన బాధితులకు అధికారికంగా అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం, గత సంవత్సరం కాలంగా అలాగే గత నాలుగు, ఆరు నెలల లోపు పట్టణ పరిధిలో పోయిన మొబైల్ ఫోన్లపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఐటీ కోర్ బృందం సహాయంతో ట్రేస్ చేశారు. మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న లబ్ధిదారులు భానుచందర్, కల్యాణ్, కుక్కు వినోద్, నిమ్మల ప్రవీణ్ కుమార్, డోలి సాయి రాణి, రాచర్ల గంగాధర్ పోలీసుల సాంకేతిక దర్యాప్తు తీరును అభినందిస్తూ ఎస్‌హెచ్‌ఓకు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ముధోల్, జూలై 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):మండల కేంద్రమైన ముధోల్ పట్టణంలోని స్థానిక మున్నూరు కాపు సంఘం భవనం నుండి కామాన్ వీధి వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ముధోల్ సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్ సోమవారం అధికారికంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముధోల్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద మంజూరైన ప్రత్యేక నిధులతో ఈ రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ముధోల్ గ్రామ సమగ్ర ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పట్టణంలో రోడ్లు లేని అన్ని అంతర్గత కాలనీలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో నూతన సీసీ రహదారులు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మున్నూరు కాపు సంఘం టౌన్ అధ్యక్షుడు భాస్కరోళ్ళ లవన్, వార్డు సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్, తాటివార్ రమేష్, శంకర్, జీవన్ పాల్గొన్నారు.

# పల్లెల్లో మారిన కాలం.. మాయమైన చేతివృత్తుల వైభవం!

## ఆత్మీయ బంధాలు కనుమరుగు..చేతివృత్తుల బతుకులు బరువు!

నిర్మల్ జూలై 12 తెలంగాణ వెన్నెల వాక్కు

నాటి గ్రామీణ ప్రాంతాలు కల్మషం లేని పవిత్రమైన సమాహారం. ధనిక, పేద తారతమ్యాల మేళవింపులో నాటి సమాజంలో ఆత్మీయత ఎంతో ఎక్కువగా ఉండేది. కులం, మతం, ఆర్థిక వ్యత్యాసాలు ఎన్ని ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరి దైనందిన జీవన విధానంలో పల్లెల్లోని అనేక రకాల కుల వృత్తులు, చేతివృత్తుల అవసరం ఎంతగానో ముడిపడి ఉండేది. ఒక గ్రామీణ నివాస ప్రాంతం ఏర్పడిందంటే ఆగ్రామ ప్రజల నిత్య జీవిత అవసరాలను తీర్చే కొన్ని ప్రత్యేక వృత్తుల వారు అక్కడ నివసించడం తప్పనిసరిగా ఉండేది. ఆయా వృత్తుల వారు సహకరించకపోతే గ్రామాల్లో ఏ పనీ ముందుకు సాగేది కాదు. దీనిని బట్టే నాటి రోజుల్లో వారి శ్రమకు, నైపుణ్యానికి ఎంతటి గౌరవం, విలువ ఉండేవో నేటి తరానికి ఇప్పటికీ స్పష్టంగా గుర్తున్నది. నాటి గ్రామీణ నాగరికతలు ఎంతో ప్రాచుర్యం పొంది, స్వయం సమృద్ధికి ప్రతీకలుగా నిలిచాయి.

?అయితే కాలక్రమేణా సమాజంలో వచ్చిన వేగవంతమైన మార్పుల కారణంగా, పల్లె సంస్కృతికి అద్దం పట్టే అనేక సాంప్రదాయ కులవృత్తులు క్రమంగా అంతరించిపోయాయి. ఆ మధురమైన జ్ఞాపకాల పల్లెనాగరికతను, నాటి జీవన విధానాన్ని ఒకసారి మననం చేసుకుందాం. భారతీయ సంస్కృతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఈ చేతివృత్తులే అసలైన పునాదిగా నిలిచాయి. వ్యవసాయ రంగంతో పాటు అనుబంధంగా సాగే ఈ వృత్తులు నాటి గ్రామీణ ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా, పల్లెలు స్వయం సమృద్ధితో వర్ధిల్లడానికి ఎంతగానో దోహదపడ్డాయి.

**అభివృద్ధి మాటున అంతరించిన కులవృత్తులు...**

ఒకప్పుడు పల్లెల్లో రైతులకు, కమ్మరి మరియు వడ్రంగి వృత్తుల వారికి మధ్య విడదీయరాని ఆత్మీయ అనుబంధం ఉండేది. నాడు గ్రామీణ ప్రాంతాలలో సాగే సాంప్రదాయ వ్యవసాయ సాగు పద్ధతులు చూడముచ్చటగా, ఎంతో ఆనందదాయకంగా ఉండేవి. ఆకాశంలో తొలికరి మేఘాలు మెరిసి, వర్షాలు కురిస్తే చాలు, రైతులు తమ పొలాల వైపు ఉరుకులు పరుగులు పెడుతూ చేసే పనులు వారి జీవితాల్లో అలౌకిక ఆనందాన్ని నింపేవి. ప్రధానంగా నాటి వ్యవసాయం ఎడ్ల నాగళ్లతోనే సాగేది. ఇందుకు అవసరమైన వడ్రంగి పనివారు రైతుల కొరకు పొద్దున్నే లేచి, నాగళ్లకు కావాల్సిన నాణ్యమైన కట్టె వస్తువులను ఎంతో నైపుణ్యంతో తయారు చేసేవారు.

ఇంటి ఇల్లాళ్లకు అవసరమైన రోకలి నుండి మొదలుకొని, పొలంలో వాడే నాగళ్లు, గొర్రులు, మరియు ఇతర అనేక రకాల వ్యవసాయ పనిముట్లను తమ చేతులతో ఎంతో శ్రద్ధగా మలిచేవారు. చెక్కను చెక్కడానికి ఉపయోగించే బాడిస, ఉలి వంటి సాధనాలతో వారు చేసే సృజనాత్మక పనులు అద్భుతంగా ఉండేవి. అంతేకాకుండా, ఇనుప పనులు చేసే కమ్మరులు గొడ్డలి, కొడవలి, పార, గునపం వంటి ఇనుప ముట్లు, సాధనాలను తమ కొలిమిలో వేసి, ఎర్రగా కాల్చి, సుత్తెతో గట్టిగా బాది చక్కని ఆకృతులను ఇచ్చేవారు. వీటిని రైతులు తమ భూములను సాగు చేయడానికి ఎంతో నమ్మకంగా ఉపయోగించేవారు. ఇలా ఊరంతా వడ్రంగి, కమ్మరి ఇళ్ల వద్ద వేచి ఉండి, తమకు కావాల్సిన ముట్లను చేయించుకునే ఆ నాటి సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు నేడు వెతికినా ఎక్కడా కనిపించడం లేదు. ఆధునిక యంత్రాలు, సరికొత్త సాంకేతిక సాధనాలు ఈ రంగంలోకి ప్రవేశించడం ద్వారా కమ్మరి, వడ్రంగి వృత్తులు పూర్తిగా కనుమరుగయ్యాయి. చేతితో చేసే వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో శ్రామికుల శ్రమకు గుర్తింపు లేకుండా పోయింది.

రజక వృత్తి నాడు గ్రామీణ ప్రాంతాలలో ఎంతో కళకళలాడుతూ సాగేది. పల్లెల్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా, లేదా అశుభ కార్యం సంభవించినా రజకుల ప్రాధాన్యత ఎంతో ఉండేది. ప్రతి ఇంటా వారి ఉనికి తప్పనిసరిగా ఉండేది. నాటి రోజుల్లో ఇంటి యజమానులు రజకులతో తమ దుస్తులను ఉతికించుకునేవారు.



అందుకోసం పంటలు చేతికి అందగానే, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారికి 'మేర' రూపంలో ధాన్యాన్ని ప్రతిఫలంగా చెల్లించేవారు. రజకులు తెల్లవారకముందే లేచి ఊరిలోని ప్రతి ఇంటికి తిరిగి బట్టలను సేకరించి, పెద్ద మూటగా కట్టుకుని తమ తలపై పెట్టుకుని చెరువులకు లేదా వాగులకు చేరుకునేవారు.

?అక్కడ నీటిలో చవుడు మట్టిని ఉపయోగించి బట్టలను ఉడకబెట్టి, ఆపై బండకేసి బలంగా బాదితే ఆ దుస్తులు మల్లెపూవుల్లా తెల్లగా మెరిసిపోయేవి. అంతటి శ్రమతో కూడిన, ప్రాముఖ్యత కలిగిన రజక వృత్తి నేడు గ్రామీణ ప్రాంతాలలో దాదాపుగా అంతరించిపోయింది. ఆధునిక కాలంలో బట్టలు ఉతికే యంత్రాలు, లాండ్రీ దుకాణాలు పెరిగిపోవడంతో ఈ సాంప్రదాయ వృత్తి పూర్తిగా చెల్లాచేదురయ్యింది. పట్టణాలలో అక్కడక్కడా కనిపిస్తున్నప్పటికీ, ఈ వృత్తిపై ఆధారపడిన నాటి తరం వారు ప్రస్తుతం జీవనోపాధి కోల్పోయి సాధారణ రోజువారీ కూలీలుగా మారిపోతున్నారు. దీనికి తోడు, ఇతర వర్గాల వారు కూడా ఈ రంగంలోకి ప్రవేశించడం వల్ల, వంశపారపర్యంగా ఈ వృత్తినే నమ్ముకున్న అసలైన వృత్తిదారులు పక్కకు తప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

?పల్లెల్లోని మరో ప్రధానమైన వృత్తి నాయీ బ్రాహ్మణులది. వీరు గ్రామీణ ప్రాంతాలలో కొన్ని గ్రామాలను తమ పరిధిగా ఎంచుకుని, ప్రతిరోజూ ఉదయాన్నే ప్రతి ఇంటికి తిరిగి పురుషులకు క్షౌరకర్మలు మరియు ముఖ అలంకరణ పనులను చేసేవారు. వీరి సేవలకు గుర్తింపుగా గ్రామస్థులు ఏడాది పొడవునా చేసిన పనికి గాను, పంటలు పండిన తర్వాత కొంత ధాన్యాన్ని లేదా జొన్నలను మేర కింద గౌరవంగా ఇచ్చేవారు. ఆ లభించిన ధాన్యంతో నాటి వృత్తిదారులు తమ కుటుంబాలను ఎంతో సంతోషంగా, తృప్తిగా పోషించుకునేవారు.

?కానీ, సమాజంలో సంభవించిన ఆధునిక మార్పుల ప్రక్రియలో భాగంగా, ఈ సాంప్రదాయ వృత్తి కూడా పల్లె ప్రాంతాల నుండి క్రమంగా తరలిపోయింది. గ్రామాల్లో సైతం ఆధునిక అందాల అలంకరణ శాలలు వెలియడంతో, పాత పద్ధతులకు కాలం చెల్లిపోయింది. ఈ విధంగా పల్లె సంస్కృతికి జీవనాడిగా నిలిచిన సాంప్రదాయ చేతివృత్తులన్నీ నేడు తీవ్రమైన ప్రమాదకర అంచుల్లోకి చేరిపోయాయి. మారుతున్న కాలంతో పాటు నడవలేక, తమ పూర్వీకుల వృత్తులను వదులుకోలేక, సరైన ఆదాయం లేక నేటి వృత్తిదారులు బ్రతకలేక, చావలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ జీవన సౌందర్యం, ఆత్మీయ సంబంధాలు ఈ ఆధునిక పోకడల మధ్య అంతరించిపోతుండటం నిజంగా ఆందోళనకరమైన విషయం.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com